క్లుప్తంగా

కోనసీమ రెడ్డి అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం



కోనసీమ రెడ్డి అసోసియేషన్‌కు ఎన్నికైన నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోనసీమ రెడ్డి అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక వడ్డిగూడెంలోని వేమన రెడ్డి కమ్యూనిటీ హాలులో రెడ్డి సామాజిక వర్గీయులు ఆదివారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోనసీమ అసోసియేషన్ అధ్యక్షుడిగా ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, కార్యదర్శిగా పులగం సూరిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పద్మారెడ్డి, కోశాధికారిగా మందేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గీయులు అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. పట్టణానికి చెందిన సినీ గేయ పరిశోధన రచయిత డాక్టర్ పైడిపాల నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘ సమావేశం

అమలాపురం రూరల్: బండారులంక ఉమారామలింగేశ్వర దేవాంగ కల్యాణ మండపంలో ఆదివారం కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన దేవాంగ సంఘ నేత, అప్పనపల్లి చెందిన పిచ్చిక పోలేశ్వరరావుకు నివాళులు అర్పించా రు. అక్టోబర్ 4న తిరుపతిలో ప్రారంభం కానున్న శ్రీనివాస ఉమా రామలింగేశ్వర అన్న దాన దేవాంగ సత్రం ఆహ్వాన పత్రాలను కోనసీమలో గ్రామ సంఘాల అధ్యక్ష కార్యవర్గ సభ్యులకు అధ్యక్షుడు పూటుకూరి అందించారు.

బహుమతుల ప్రదానం

అమలాపురం రూరల్: దసరా సందర్భంగా ఘనంగా బ్రహ్మ ధ్యాన సత్సంగ్ ఆధ్వర్యంలో అమలాపురం నల్లమిల్లిలో బాలలకు నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. కోనసీమ జిల్లా బ్రహ్మ ధ్యాన సత్సంగ్ బాధ్యులు ఎ.కుమార్ అధ్యక్షతన మూడు రోజుల పాటు ఉచితంగా నిర్వహించిన శిబిరంలో యోగ, ధ్యాన, వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించారు. వంద మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అమలాపురం బ్రహ్మ ధ్యాన బాధ్యులు పిల్లా కరుణ సర్టిఫికెట్లు, పతకాలు ప్రదానం చేశారు. సంస్థ వ్యవస్థాపకులు దండుప్రోలు మహేష్, ఆకాష్, బ్రహ్మ ధ్యాన సత్సంగ్ బాధ్యులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

2 కిలోల గంజాయి స్వాధీనం

అమలాపురం టౌన్: పట్టణంలోని సావరం రోడ్డులోని కొబ్బరి తోటల్లో ముగ్గురు యువకులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పట్టణ పోలీసులు ఆదివారం సాయంత్రం దాడి చేశారు. యువకుల నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మూడు సెల్ ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. అమలాపురం పట్టణం గారపాటి వీధికి చెందిన రాయపురెడ్డి ధర్మతేజ, అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి శివారు భట్లపాలెంకు చెందిన ధర్మాడి వంశీ, అమలాపురంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాహుల్ హజ్రాలను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. నిందితులను కోర్టులో సోమవారం హాజరుపరచనున్నట్లు చెప్పారు. ఈ ముగ్గురు నిందితులు విశాఖ జిల్లా అటవీ ప్రాంతం నుంచి గంజాయిని అమలాపురానికి గుట్టుగా తరలించి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణ ఎస్సై మనోహర్ జోషి ఈ ముగ్గురు యువకులపై దాడి చేసి పట్టుకున్నారన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఊరట

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో ప్రజల్లోనూ, వ్యాపార వర్గాల్లోనూ ఊరట కనిపిస్తోందని రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద పట్టణంలోని వ్యాపార సంఘాల ప్రతినిధులతో జీఎస్టీపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీఎస్టీ తగ్గించిన వస్తువుల వివరాలను ఆయన తెలిపారు. సదస్సులో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, ముఖ్య సలహాదారు నల్లా పవన్‌కుమార్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, వివిధ వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి సహకారం

యానాం: స్థానిక బైపాస్ రహదారి తదితర ప్రాంతాల్లో తోపుడుబండ్లు తదితర వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్న చిరువర్తకుల వ్యాపారాభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం శ్రీలక్ష్మీ శ్రీనివాస తోపుడుబళ్ల వర్తక సంఘం ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో భాగంగా స్థానిక ఫెర్రీ రహదారిలో క్షత్రియ పరిషత్ కల్యాణ మండపంలో మల్లాడి కృష్ణారావును వారు ఘనంగా సత్కరించారు. ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్, నాయకులు పాల్గొన్నారు.



గురజాపులంకలో మునిగిన వాణిజ్య పంటలు



బోడసకుర్రు పల్లిపాలెంలోని మత్స్యకార కాలనీలోకి వరద నీరు



నీట మునిగిన గురజాపు లంక ప్రధాన రహదారి

ముంపు బారిన లంక గ్రామాలు



లంకాఫ్ ఠానేల్లంక మత్స్యకార కాలనీలో ముంపు నీరు

ముమ్మిడివరం: గోదావరి వరద ఉధృతి పెరుగడంతో లంకగ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గోదావరి తీరం ఉన్న గ్రామాలు ముంపు బారినపడ్డాయి. మండలంలో లంకాఫ్ ఠానేల్లంక, మత్స్యకార కాలనీ, గురజాపులంక, కూనాలంక, చింతపల్లిలంక, చింతావానిరేవు, గ్రామాలను వరద నీరు పోటెత్తింది. రహదారులు మునిగాయి. ఆయా గ్రామాల్లో ఇళ్ల వద్దకు వరద నీరు చేరింది. కూనాలంక, గురజాపులంక గ్రామాలకు చెందిన సీసీ రహదారులు మునగడంతో ప్రజలు నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. పల్లవారిపాలెం, అన్నంపల్లి అక్విడెక్టు, మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. వరద మరింత పెరిగే అవకాశమున్నందున నివాస గృహాల్లోని నిత్యావసర వస్తువులు, పశువులను వ్యవసాయ ఉత్పత్తులను లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ముంచెత్తిన వరద

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలాన్ని మరో మారు వరద ముంచెత్తింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రభావంతో పల్లిపాలెంలో మత్స్యకారుల ఇళ్లు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరద కారణంగా పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. రెండు నెలల వ్యవధిలో మత్స్యకార కాలనీని మూడు సార్లు వరద ముంచెత్తడంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద వచ్చిన ప్రతిసారీ జీవనోపాధి కోల్పోతున్నామని మత్స్యకారులు అన్నారు. మూడు సార్లు వరద వచ్చినా కనీసం కూటమి ప్రభుత్వం స్పందించలేదని, పరిహారం ఊసేలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చట్ట సభలో బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు తగవు



అమలాపురంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: చట్ట సభలో సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ వెకిలి చేష్టలు, అనుచిత వ్యాఖ్యలు సహించరాదని, అసెంబ్లీ స్పీకర్ తక్షణం స్పందించి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ముమ్మిడివరం, మండపేట అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై తీవ్ర పదజాలంతో వ్యాఖ్యలు చేసిన బాలకృష్ణే అసలైన సైకో అని శ్రీనివాసరావు అమలాపురంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో అన్నారు. పెగ్గు, విగ్గుతో సిగ్గు లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడే బాలకృష్ణ పెద్ద మానసిక రోగి అని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో తమ పార్టీ అధినేత జగన్‌పైనే కాకుండా అగ్ర నటుడు చిరంజీవిపై తూలనాడిన బాలకృష్ణ మానసిక స్థితి సరిగా లేదని ప్రజలకు అర్థమైందన్నారు. చిరంజీవిని చూసైనా హుందాతనం, నిజాలు మాట్లాడడం నేర్చుకోవాలని బాలకృష్ణకు శ్రీనివాసరావు సలహా ఇచ్చారు. మాజీ మంత్రి పేర్ని నాని సవాల్‌ను స్వీకరించని బాలకృష్ణ ఎంత అసమర్థుడో రాష్ట్ర ప్రజలకు తెలిసిందని శ్రీనివాసరావు ఆరోపించారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు నాని తదితరులు



ముమ్మిడివరంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ముమ్మిడివరం, మండపేట నియోజకవర్గాల పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు అన్నారు.వైఎస్సార్ సీపీ ఆదేశాల మేరకు ఆదివారం అమలాపురం మండలం భట్నవిల్లిలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసంలో బాధితులకు అండగా ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్‌ను శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు సంసాని నాని ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు తీరు మార్చుకోవాలని వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించిన వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. మంత్రి లోకేష్ తీసుకొచ్చిన రెడ్ బుక్ ప్రజలను భయాందోళనకు గురిచేస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన డిజిటల్ బుక్ కార్యకర్తలకు రక్షణగా ఉంటుందని అన్నారు. సమస్యలు డిజిటల్ బుక్ లో నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, కొనుకు గౌతమి, ఉప్పలగుప్తం మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదార్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఉంద్రు బాబ్జీ, బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఉంద్రు వెంకటేష్, మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి గొవ్వాల రాజేష్, ఇంటలెక్చువల్ ఫారం రాష్ట్ర కార్యదర్శి గుత్తుల ఈశ్వర ప్రసాద్, జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను, ఒంటెద్దు వెంకయ్యనాయుడు, కూడుపూడి భారత్, దొంగ చిన్నా ,పాటి రవి, సుంకర సుధా, కౌన్సిర్ నాగారపు వెంకటేశ్వరరావు, గోపి రాజి రమేష్, సుంకర సుదా పాల్గొన్నారు.

కార్యకర్తలకు భరోసాగా డిజిటల్ బుక్

ముమ్మిడివరం: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు భరోసా నిస్తూ డిజిటల్ బుక్ ప్రారంభించారని వైఎస్సార్ సీపీ ముమ్మిడివరం నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆదివారం ఆయన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నాడ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతోందన్నారు. పార్టీ శ్రేణులను కాపాడుకునేందుకు వైఎస్ జగన్ డిజిటల్ బుక్ ప్రారంభించారని తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కార్యకర్తలు తమ ఇబ్బందులపై ఫిర్యాదు చేస్తే వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఐవీఆర్ విధానం ద్వారా 040-49171718 టెలిఫోన్ నంబరుకు కాల్ చేసిన తర్వాత ఎలా ఫిర్యాదు చేయాలన్న దానిపై సూచనలు అందుతాయన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కాశి బాలమునికుమారి, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ముమ్మిడివరం, కాట్రేనికోన జెడ్పీటీసీలు కుడిపూడి శంకరరావు, నేల కిశోర్, రాయపురెడ్డి జానకీరామయ్య, కాశి రామకృష్ణ, బొంతు సత్యశ్రీనివాస్, జగతా పద్మనాభం, పోతుల రత్నకుమారి, కాశి లక్ష్మణస్వామి, మట్టపర్తి సురేష్, కాశి వెంకటరమణ, విద్యార్థి విభాగం అధ్యక్షుడు గంటి ఆకాష్, రేకాడి వర్మ, బొర్రా విష్ణు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబుకు సత్కారం



మాజీ ఎమ్మెల్యే పొన్నాడను కలిసి కృతజ్ఞతలు తెలిపిన పెయ్యల చిట్టిబాబు

ముమ్మిడివరం: ఇటీవల వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పెయ్యల చిట్టిబాబు ఆదివారం పలువురు నాయకులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజును ఆయన స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిట్టిబాబును మాజీ ఎమ్మెల్యే పొన్నాడ ఘనంగా సత్కరించారు. ఆయన వెంట సర్పంచ్ మోకా రామారావు, వైస్‌ఎంపీపీ మట్టపర్తి సురేష్, చప్పిడి వెంకటరావు, పెయ్యల సిద్దు, బల్ల రమేష్, పి.సత్యనారాయణ, శీలం శ్రీనివాస్, యనమదల రామకృష్ణ, తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీ రైతు విభాగ అధ్యక్షుడికి సత్కారం



రామారావును సత్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

అల్లవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడిగా ఇటీవల ఎంపికైన అల్లవరం మండలం డి.రావులపాలెంకు చెందిన జున్నూరి రామారావు (బాబీ)ని రాజానగరం నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షుడు తోరాటి శ్రీనివాస్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామారావుకు పూలమాల వేసి శాలువాలతో సత్కరించారు. జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు జున్నూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు నాగు పాల్గొన్నారు.

సాహితీవనంలో నవ యుగ కవి చక్రవర్తి జాషువా



గుర్రం జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు, కవులు

అమలాపురం టౌన్: సాహితీ వనంలో నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల గుర్రం జాషువా అని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మడికి శ్రీరాములు అన్నారు. స్థానిక సుభాస్ లే అవుట్‌లో గుర్రం జాషువా జయంతిని ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆదివారం నిర్వహించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి మడికి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన జయంతి సభలో శ్రీరాములు మాట్లాడారు. తొలుత అసోసియేషన్ ప్రతినిధులు జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవులు సీలి సంసోను, ముమ్మిడివరపు వెంకటేశ్వరరావు, రాయి వెంకటేశ్వరరావు, రాయి దుర్గారావు మాట్లాడుతూ జాషువా రచనలను వివరించారు. ఏపీసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, అసోసియేషన్ ప్రతినిధులు తెన్నేటి రాజబాబు, మట్టా నాగేశ్వరరావు, నవుండ్రు లక్ష్మణరావు, ఎంఆర్‌పీఎస్ నాయకులు నేదునూరి సతానియేలు, సవరపు నానిబాబు సభలో ప్రసంగించి జాషువా సాహితీ వైభవాన్ని వివరించారు.

సాహితీ సముద్రుడు జాషువా

ఐ.పోలవరం: భావ విప్లవ సాహితీ సముద్రుడు జాషువా అని పలువురు కవులు కళాకారులు పేర్కొన్నారు. ప్రజ్ఞాసాహితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25 నుంచి 28వ తేదీ వరకు ఐ పోలవరంలో నిర్వహించిన సాహిత్యం సామాజిక న్యాయం అనే అంశంపై సదస్సులు నిర్వహించారు. ఆదివారం జాషువా జయంతితో ముగింపు సభ నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకుడు ఆర్.అప్పలస్వామి పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవ రాత్ర మహోత్సవాలు



కాత్యాయనిదేవిగా అమలాపురం వైష్ణవీ కనకదుర్గమ్మ



సావిత్రినగర్‌లో కనకదుర్గమ్మవారి ఆలయం వద్ద మహిళల పూజలు

అమలాపురం టౌన్: శరన్నవ రాత్ర మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం అమలాపురంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీదేవి ఆలయం, గోల్డ్ మార్కెట్‌లోని శ్రీకామాక్షీ ఏకామ్రేశ్వరీదేవి ఆలయం, హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణదుర్గ ఆలయాల్లో అమ్మవార్లు మహాచండీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని వైష్ణవీ కనకదుర్గ ఆలయం , వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవార్లు కాత్యాయినిదేవిగా అలంకృతమయ్యారు. గోల్డ్ మార్కెట్‌లో గల కామాక్షీ ఏకామ్రేశ్వరీదేవి ఆలయం వద్ద పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

లక్ష కుంకుమార్చన

యానాం: యానాంలో కొలువైన శ్రీలలితాదేవి ఆలయం వద్ద శ్రీదేవీనవరాత్ర మహోత్సవాలను పురస్క రించుకుని ఆదివారం నిర్వహించిన లక్షకుంకుమార్చన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యానాం పరిసరప్రాంతాలకు చెందిన అధికసంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నున్న రాజశేఖర్, వెంకటసూర్యరమ్యశ్రీతేజస్వీ, పెంటపాటి వెంకటేశ్వరరావు, వరలక్ష్మీ దంపతులచే లక్షకుంకుమార్చన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో లలితాభక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

సావిత్రినగర్‌లో... నియోజకవర్గ పరిధిలో తీరప్రాంత గ్రామమైన సావిత్రినగర్‌లో కొలువైన శ్రీకనకదుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీభగవతి శ్రీహరిశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రాయప్రోలు కామేశ్వరశర్మ, సావిత్రినగర్ యువత అధ్యక్షుడు మల్లాడి రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భవానీల పడి పూజ

తాళ్లరేవు: శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామ దేవత మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద భవానీల పడిపూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో సుమారు 250 మంది భవానీలు పడిపూజలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తాళ్లరేవు ప్రధాన రహదారిలోని కనకదుర్గమ్మ ఆలయంలో, కోరంగిలోని దుర్గా పంచాయతన ఆలయంలో అమ్మవారు మహాచండీ అలంకరణలో దర్శనమిచ్చారు.

మహాచండీ దేవిగా అమ్మవారు

ముమ్మిడివరం: అమ్మవారు ఆదివారం మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముమ్మిడివరంలో కుమ్మర్లవీధి, మార్కెట్ సెంటర్, మెయిన్‌రోడ్డు, రాజుపాలెం, క్రాపచింతలపూడి, సోమిదేవరపాలెం, అయినాపురం, పల్లవారిపాలెం, చినకొత్తలంక, గోదసివారిపాలెం, లక్ష్మీదేవి లంక, మార్కెట్ సెంటర్ ఆలయాల్లో అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముమ్మిడివరం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద చండీ హోమం నిర్వహించారు.

ఉపాధ్యాయుడిగా.. ఆటో డ్రైవర్



ఆటో వద్ద తల్లి నారాయణమ్మతో సంగాని రాంబాబు

ఐ.పోలవరం: ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా, తండ్రి మరణం కుంగదీసినా ఆ యువకుడు లక్ష్య సాధనలో వెనకడుగు వేయలేదు. తన చదువుకు ఫీజుల కోసం టైలరింగ్ వృత్తి చేస్తూ, ఆటో నడుపుతూ ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యాడు. ఇదే సమయంలో అండగా నిలిచిన తల్లి అనారోగ్యం పాలవ్వడంతో ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని దీక్షతో కృషి చేసి ఉపాధ్యాయునిగా ప్రభుత్వ కొలువు సాధించాలనే లక్ష్యం ముందుకు సాగాడు. ఆటో నడుపుకుంటూనే ఖాళీ సమయంలో చదువుతూ తాజాగా నిర్వహించిన డీఎస్సీలో కొలువు సాధించి ఆదర్శంగా నిలిచాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.మూలపాలంలోని సంగాని రాంబాబు. పేద మత్స్యకార కుటుంబం, తల్లిదండ్రుల వేటపైనే జీవనం సాగించాల్సి రావడంతో రాంబాబు బాల్యం ఒడిదొడుకుల మధ్య సాగింది. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో తల్లి సంగాని నారాయణమ్మ చేపలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తూ ముగ్గురు ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేసింది. రాంబాబు పదో తరగతి వరకు జి.మూలపాలెం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. కుటుంబ పోషణకు టైలరింగ్ చేస్తూ ఇంటర్మీడియట్ కాకినాడ ఎంఎస్ఎన్ కాలేజీలో పూర్తి చేశాడు. 2016లో డి.విజయ గౌతమి ఆటో యూనియన్‌లో చేరి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా పనిచేశాడు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో 77వ ర్యాంక్ సాధించి సోషల్ స్టడీస్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రాంబాబు ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావడంతో అతని కుటుంబ సభ్యులతోపాటు, ఆటో యూనియన్ సభ్యులు సంబరాలు చేసుకున్నారు.

తల్లి ఆశయాన్ని నెరవేర్చాను

నా తల్లి ఆశయాన్ని నెరవేర్చాను. ఉద్యోగం వస్తుందనే నమ్మకం తొలి నుంచి ఉంది. ఆటో నడుపుకుంటూనే చదువుకున్నా. పరీక్షల రెండు నెలల పాటు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉన్నారు. పగలు ఆటో నడుపుతూ రాత్రి వేళలో చదువుకున్నాను. నా విజయానికి కుటుంబ సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు ఎంతగానో సహకరించారు.

– సంగాని రాంబాబు

బాధిత దివ్యాంగునికి పరామర్శ

అల్లవరం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలైన కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన దివ్యాంగుడు నెల్లి ఏడుకొండలను దివ్యాంగుల సంక్షేమ సంఘం మాజీ గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఒంటెద్దు వెంకయ్యనాయుడు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడుకి ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గెద్దాడ జాన్ తాతారావు, నిమ్మకాయల చంద్రశేఖర్, నాగవరపు పరశురాముడు పాల్గొన్నారు.

పార్కుల్లో ఫిట్‌నెస్ పరికరాలు ఏర్పాటు చేయాలి

అమలాపురం టౌన్: పట్టణంలోని మున్సిపల్ పబ్లిక్ పార్కుల్లో ప్రజారోగ్యం దృష్ట్యా ఓపెన్ ఎయిర్ ఫిట్‌నెస్ ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌కు జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, కోశాధికారి జి.త్రినాథ్ వినతిపత్రం అందించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం వారు కమిషనర్‌ను వారు కలిశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఉప్పలగుప్తం: క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని సీఐ ప్రశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నాగులపల్లి లక్ష్మీనారాయణ మెమోరియల్ ప్రీమియర్ లీగ్ లైట్ టెన్నిస్ క్రికెట్ టోర్నమెంటు ప్రారంభోత్సవానికి సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సై రాజేష్, హెచ్ఎం జి.కనకదుర్గ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.

యాత్రికులకు ఘన స్వాగతం

ఐ.పోలవరం: టెంపుల్ టూరిజంలో భాగంగా ఆర్టీసీ సంస్థ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పుణ్యక్షేత్ర దర్శిని కార్యక్రమంలో మురమళ్ల వీరేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చిన భక్తులకు అధికారులు ఆదివారం ఘనస్వాగతం పలికారు. ప్రతి ఆదివారం బస్సు సర్వీసు నడుపుతున్నట్టు రావులపాలెం ఆర్టీసీ డిపో అధికారిణి అచ్చుతాంబ తెలిపారు.